
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 27 డిసెంబర్ 2024



మన్మోహన్..ఇకలేరు..



తిరుపతి జిల్లాతో మన్మోహన్‌సింగ్‌కు ఎంతో అనుబంధం ఉంది. మన్నవరం ప్రాజెక్టును ప్రారంభించారు. శ్రీవారి సేవకు విచ్చేసిన సందర్భంగా... (వార్త మెయిన్‌లో..)

తిరుమల శ్రీవారి పాదాల చెంత..



స్మార్ట్ కం(ఇం)పు



వర్షం వచ్చే.. డ్రైనేజి పొంగే..కంపు కొట్టే..!
శిథిలావస్థలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ
ఆధునిక టెక్నాలజీకి రూ.300 కోట్లు ప్రతిపాదన

ప్రజలు : మా వీధిలో రెండు రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతోంది సార్... ఇంట్లో ఉన్నా కంపు కొడుతోంది.. వీధిలో తిరగలేకుండా ఉన్నాం..

శానిటేషన్ : ఆ.. సిబ్బందిని పంపిస్తాం..

(సిబ్బంది రావడం, మ్యాన్‌హోల్ ఎత్తడం, డ్రైనేజీ కలియతిప్పడం)

వారానికే మళ్లీ ఫోన్.. సిబ్బంది రావడం.. వెళ్లడం.. ప్రతివారం శానిటేషన్ సిబ్బందితో కార్పొరేషన్ కమిషనర్ సమీక్షలు చేయడం.. తెల్లవారి ఆకస్మిక తనిఖీలు.. షరామామూలే.. నగర ప్రజలకు తగినట్లుగా పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో వారి పాట్లు వర్ణనాతీతం. ఉత్తి చేతులతోనే జోరువానలోనూ డ్రైనేజీ పనులను ప్రాణాలను పణంగా పెట్టి చేస్తూ ఉంటారు.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి స్మార్ట్‌సిటీ పేరుకే.. ఈ వీధి చూసినా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కంపు కొడుతుంది.. వరదరాజనగర్, లీలామహల్ రహదారి, ఎవిఆర్ కాలనీ, సుందరయ్యనగర్ తదితర ప్రాంతాలైతే డ్రైనేజీ మురుగు చెరువులను తలపిస్తుంది.. ఎపుడో 1996లో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకుంది.. ఎలుకలు విజృంభించి పైపులు కొట్టేసి, చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ వ్యవస్థ పొంగిపొర్లే పరిస్థితి. శాశ్వతంగా ఆధునిక టెక్నాలజీతో నిర్మించాలంటే రూ.300 కోట్లు కావాలి. పాత వ్యవస్థ పనికిరాదన్న విషయం కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలోని అందరికీ తెలుసు.. ఆధునిక టెక్నాలజీతో కొత్తది నిర్మించాలంటే కార్పొరేషన్ వద్ద డబ్బుల్లేవని ఉన్నతాధికారులు చేతులెత్తేస్తున్నారు.. కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా పట్టించుకుని శ్రీవారి పాదాల చెంత ఉన్న తిరుపతిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఆధునిక టెక్నాలజీతో యుద్ధప్రాతిపదికన నిర్మించాల్సిన అవసరం ఉంది.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

గత నెలలో మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో తిరుపతిలో కొత్తగా యుడిఎస్ వ్యవస్థ నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాలని తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి కోరారు. రూ.300 కోట్లు అవుతుందని ప్రతిపాదనలను నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం తయారు చేసింది. అయితే ఇంతపెద్ద మొత్తంలో కార్పొరేషన్ వద్ద నిధులు లేకపోవడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు, టిటిడి సహకరిస్తే తప్ప యుడిఎస్‌ను ఆధునిక టెక్నాలజీతో నిర్మించలేమని ఉన్నతాధికారులు చేతులెత్తేశారు. 1996లో రూ.18 కోట్ల రూపాయలతో తిరుపతి నుంచి రేణిగుంట తూకివాకం వరకూ 14 కిలోమీటర్ల వరకూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించారు. అప్పట్లో ఆర్‌ఆర్‌సి పైపులతో 25ఏళ్ల కాలపరిమితితో నిర్మించారు. ప్రస్తుతం కాలపరిమితి ముగిసింది. నూతనంగా డిఐ (ఇనుము) పైపులు పెట్టి 50 ఏళ్ల కాలపరిమితితో నిర్మించాలని భావిస్తున్నారు. గతంలో తిరుపతి స్మార్ట్‌సిటీ పథకంలో యుడిఎస్ కొత్త కనెక్షన్ నిర్మించాలని ప్రతిపాదన తయారు చేస్తే, ఆ పథకంలో దీన్ని తిరస్కరించారు. స్మార్ట్‌సిటీ పథకంలో యుడిఎస్ వర్తించదని కేంద్రం స్పష్టం చేసింది.

తాత్కాలిక మరమ్మతులతో తడిచిమోపెడు

యుడిఎస్ పైపుల కాలపరిమితి ముగిసింది. నూతనంగా నిర్మించాల్సి ఉంది. అయితే నిధులు లేని కారణంగా పాత పైపులనే తాత్కాలిక మరమ్మతులు చేస్తూ గత ఐదేళ్ల కాలంలో ఆరు కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. తిరుపతి - రేణిగుంట మార్గంలో ఈ పైపులైను మార్చడానికి దాదాపు 100 కోట్లు అవుతుందని అంచనా. పైప్‌లైన్ మరమ్మతులు చేసిన ప్రైవేట్ టెలిఫోన్ ఆపరేటర్ కంపెనీలు తరచూ కేబుల్ వేయడానికి రోడ్లు తవ్వుతూ ఉండటం కూడా యుడిఎస్ దెబ్బతినడానికి కారణమని చెప్పవచ్చు. ఎపుడో 1996లో రేణిగుంట మండలం తూకివాకం గ్రామంలో ఫిల్టర్ ట్యాంకు నిర్మించారు. నగరంలో 4 లక్షల జనాభా కలిగి ఉన్నారు. 50 డివిజన్లకు గాను 60వేల యుడిఎస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో నుంచి వచ్చే మురుగును నేరుగా రేణిగుంట మీదుగా తూకివాకం గ్రామం ఫిల్టర్ ట్యాంకులో ఫిల్టర్ చేసి, మురుగునీటిని కొన్ని ప్రైవేట్ ఫ్యాక్టరీలకు లీటర్‌కు కొంత అమౌంట్ తీసుకుని, రైతులకు ఉచితంగానూ కార్పొరేషన్ అందిస్తోంది. మురుగునీటి ద్వారానే నగర పాలక సంస్థకు ఏడాదికి 10-20 లక్షల రూపాయల ఆదాయం వస్తోంది. గతంలో వర్షాకాలం రాకముందే నగరంలో మురుగుకాల్వల పూడికతీత పనులు చేసేవారు. అయితే ఈ ఏడాది మురుగునీటి కాల్వ పూడికతీత పనుల టెండర్లు ఆలస్యంగా పిలవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

30కోట్లతో ప్రతిపాదన : శ్యాంసుందర్, ఎస్ఇ, మున్సిపల్ కార్పొరేషన్, తిరుపతి

తిరుపతి -రేణిగుంట రోడ్డు వద్ద ఉన్న యుడిఎస్ పైపులైన్ మార్చడానికి రూ 30కోట్లు వెచ్చించి పాత పైపులైన్ మార్చి కొత్త పైపులైన్ వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలో పనులు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కే...
28, 29 తేదీల్లో 'బాలోత్సవం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కే బాలోత్సవమని వ్యవస్థాపక నిర్వాహకులు మల్లారపు నాగార్జున తెలిపారు. నేటితరం విద్యార్థుల్లో ఉన్న సజనాత్మకతను వెలికి తీసి వారి ఉజ్వల భవిష్యత్‌కు పటిష్టమైన పునాదులు వేయడానికి, వారికి దూరమవుతున్న కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలను దగ్గర చేయడానికి పిల్లల పండుగ పేరుతో తిరుపతి బాలోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలోత్సవానికి ఆదరణ పెరిగి ఏటేటా పాల్గొనే విద్యార్థుల సంఖ్య వేలల్లో ఉంటుందన్నారు. సాంస్కృతిక, హస్త కళలు, క్రీడలు, అకడమిక్ విభాగాలలో 30 అంశాలపై 70 విభాగాలుగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 2022లో ఈ తిరుపతి బాలోత్సవం పిల్లల పండుగ ప్రారంభించామని, మొదట 3500 మంది, 2023లో 5700 మంది, ఈ ఏడాది 2024 లో నిర్వహించే బాలోత్సవ కార్యక్రమానికి 8000 మంది ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుండి విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి బాలోత్సవం పిల్లల పండుగ గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, అధ్యక్షులు నడ్డి నారాయణ, కోశాధికారి పంచ ముఖేశ్వరరావు, బాలోత్సవం కార్యనిర్వాహకులు వెంకటరమణ, నెల్లూరు మునిలక్ష్మి, తహసున్నిసా బేగం, బాలాజీ చౌదరి, రెడ్డప్ప, కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీసిటీని సందర్శించిన డిపిఐఐటి కార్యదర్శి

ప్రజాశక్తి - సత్యవేడు

కేంద్ర, వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం కార్యదర్శి అమర్‌దీప్‌సింగ్ భాటియా గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రముఖ ఆటోమోటివ్, ఎయిర్ కండీషనర్ బ్రాండ్ల ఉనికి, బలమైన సరఫరా గొలుసుతో దేశంలో అగ్రగామి కేంద్రంగా శ్రీసిటీ వేగంగా ఎదుగుతోందని చెప్పారు. పారిశ్రామికవాడలో పర్యటించిన ఆయన డైకిన్ ఏసీ తయారీ పరిశ్రమను సందర్శించి అక్కడి తయారీ కార్యకలాపాలను పరిశీలించారు. 'కీలకమైన విడిభాగాల కోసం భారతదేశం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించే చర్యగా' దానిని పేర్కొన్నారు. శ్రీసిటీ అద్భుత పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని అమర్‌దీప్ సింగ్ ప్రశంసించారు.

అన్యమతస్తుల చర్చ సరైంది కాదు : చింతామోహన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అన్యమతస్తుల చర్చ సరైంది కాదని, ఈ దేశంలో మైనార్టీలు వేరే దేశంలో మెజార్టీగా ఉన్నారని, ఈ దేశంలో మెజార్టీగా ఉన్న హిందువులు అమెరికాలో మైనార్టీలుగా ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. టిటిడిలో పనిచేసే ప్రధానార్చకులు, అర్చకులు, శాశ్వత ఉద్యోగులు, జర్నలిస్టులకు అలిపిరి నుంచి పేరూరు వరకూ ఉన్న టిటిడి భూముల్లో ఒక్కొక్కరికి ఐదు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించాలని, స్విమ్స్‌కు అంతర్జాతీయ హోదాను కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. కొత్తగా టిటిడి తీర్మానించడం విడ్డూరం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి పాల్గొన్నారు.



పీజీ పరీక్షలు వాయిదా వేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో విద్యార్థులు వర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున మాట్లాడుతూ పీజీ మొదటిసెమిస్టర్ విద్యార్థులకు ఎపిపిజిసెట్ -2024 కౌన్సిలింగ్ సెప్టెంబర్ మధ్యలో జరిగిందని, ఇంతవరకూ చాలా డిపార్టుమెంట్లలో సిలబస్ అవలేదన్నారు. ఇంటర్నల్స్ కూడా జరగలేదన్నారు. ఇప్పటికిప్పుడు పరీక్ష ఫీజు చెల్లించమని చెప్పడం, సమయం ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం ఏంటన్నారు. ఈనెల 30 నుంచి జరిగే పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలను జనవరి ఆరో తేదీ నుంచి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పరిపాలనా భవనం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఆఫీస్ బేరర్స్ అశోక్, నరేంద్ర, వీరేష్, భాను, భాస్కర్, తిరుమలేష్, నర్సన్న, శంకర్, ఎన్ఎస్‌యుఐ మన్సూర్ పాల్గొన్నారు.



సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలి

పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కార్యాలయం ముందు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ సమ్మె కాలపు ఒప్పందాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, గత ఏడాది నిర్వహించిన 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీ లైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్ గ్రేషియా, దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం, ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంపు, సంక్షేమ పథకాలు తదితర డిమాండ్ల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి డి. కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ప్రసాద్, బి.మురళి, మణమ్మ, బి.ప్రభావతి, ఎన్. వెంకట రమణయ్య, శాంతి వర్ధన్, ఆనంద్, సి.ఐ.టి.యు నాయకులు బీ.వి. రమణయ్య, ఎస్.సురేష్, పామంజి మణి, పుట్టా శంకరయ్య పాల్గొన్నారు.




'హెల్మెట్' ప్రయోజనాలెన్నో...

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, ఓజిలి, తిరుపతి సిటి

హెల్మెట్ ధరించడం వల్ల వాహనదారులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి తెలిపారు. పట్టణ నాలుగు మాడ వీధుల్లో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి భద్రత, నియమాలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ దామోదరం నాయుడు, సీఐలు గోపి, వెంకటేశులు, తిమ్మయ్య, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలిలో... 'హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి' అంటూ ద్విచక్ర వాహనదారులకు ఓజిలి ఎస్ఐ. కే.స్వప్న అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యువకులు ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడపడం ఫ్యాషన్ గా మారిపోయిందని, వేగం అదుపు తప్పి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులకు శోకాన్ని మిగిలిస్తున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యంగా ప్రయాణించకుండా సురక్షితంగా ఇంటికి చేరడం వలన ఇంటిల్లిపాదీ ఆనందంగా ఉంటారని, ప్రాణం విలువ తెలుసుకొని ప్రయాణించాలని కోరారు. హెల్మెట్ ధరించడం ద్వారా ఆకస్మికంగా ప్రమాదం జరిగినపుడు ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని అన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేస్తే ఉపేక్షించకుండా జరిమానాలు విధించడమే కాకుండా లైసెన్స్ రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గురుమూర్తి రాజు , పిసీలు మైలారి వెంకటేష్, రవి ,మస్తాయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓజిలిలో...


తిరుపతి సిటి : రూరల్ సిఐ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది వినూత్నంగా హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతకు అందరూ సహకరించాలని కోరారు. అవిలాల సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేసి, మానవహారం నిర్వహించారు.

ఎన్నాళ్లని నిరీక్షణ

టిడిపి, జనసేన శ్రేణుల్లో నిరుత్సాహం
ప్రధాన నాయకత్వంలో పెదవివిరుపు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి ప్రభుత్వం విజయదుందుభి మోగించింది. ఇక అందరికీ పదవులు వస్తాయని తిరుపతి జిల్లాలో ఆశించారు. కూటమి ప్రభుత్వం భాగస్వామ్యంతో ఉన్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డికి టిటిడి బోర్డులో చోటు దక్కింది. నారా లోకేష్‌కు 'ప్రజాగళంలో' దగ్గరుండి అన్నీ చూస్తున్న రవినాయుడుకు శాప్ ఛైర్మన్‌గా అవకాశం వచ్చింది. అటు చిత్తూరు, ఇటు తిరుపతి జిల్లాల్లో అత్యధిక స్థానాలు ఎంఎల్ఎలను గెలిచినా ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ ఎంఎల్ఎ ఎన్.అమరనాథరెడ్డికి మంత్రి పదవి వస్తుందని అందరూ అనుకున్నారు. అయితే చివరి నిమిషంలో మొండిచేయి చూపించారు. ఆ అసంతృప్తి ఇప్పటికీ ఆ నియోజకవర్గంలో కొనసాగుతూనే ఉంది. కాణిపాకం, శ్రీకాళహస్తి, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ, బోయకొండ, చంద్రగిరి మూలస్థానమ్మ, వేశాలమ్మ ఆలయాలకు, తిరుపతి, పాకాల, చిత్తూరు, బంగారుపాళ్యం, దామలచెరువు, గూడూరు, చంద్రగిరి మార్కెట్‌యార్డులకూ పదవులు ప్రకటించలేదు. అలాగే తుడా ఛైర్మన్ ఎవరన్నది తేలలేదు. తిరుపతి నియోజకవర్గంలో మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వూకా విజయ్‌కుమార్‌తో పాటు కోడూరు బాలసుబ్రమణ్యం, జెబి శ్రీనివాస్‌లు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఎంఎల్ఎ పదవికి పోటీ పడ్డారు. అయితే చివరి నిమిషంలో చిత్తూరు నుంచి వలసొచ్చి ఆరణి శ్రీనివాసులు దక్కించుకున్నారు. ద్వితీయశ్రేణి నాయకులు పదవులను ఆశిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఏడు నెలలైనా పదవుల పందేరం జరగకపోవడంతో టిడిపి, జనసేన నేతల్లో నిరుత్సాహం మొదలయ్యింది. టిడిపి సభ్యత్వం పైపైకి నవ్వుతూ చేస్తున్నా, లోలోన వారిలో నిరుత్సాహం నెలకొంది. జనవరి 1 నూతన సంవత్సరానికైనా పదవులు ప్రకటిస్తారా; లేదా అన్నది వేచి చూడాల్సిందే.



నేటి నుంచి రాష్ట్రస్థాయి డ్రాగన్ బోట్ పోటీలు

రాయలచెరువులో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రామచంద్రాపురం

మండలంలోని రాయలచెరువులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, కెనాయింగ్, కయా కింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13వ జాతీయ డ్రాగన్ బోట్ ఛాంపియన్షిప్ పోటీలలో భాగంగా శుక్రవారం నుంచి రాష్ట్రస్థాయి డ్రాగన్ బోట్ చాంపియన్షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. గురువారం రాయలచెరువు లో జరగనున్న డ్రాగన్ బోట్ ఛాంపియన్షిప్ పోటీల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలచెరువును ఒక పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని ఆశయంగా కషి చేస్తున్నారని చెప్పారు. శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు సీనియర్స్ విభాగం క్రీడాకారులకు పోటీలు నిర్వహించి జాతీయ క్రీడలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన క్రీడాకారులను జనవరి మూడవ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే జాతీయ క్రీడలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. జనవరి నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జూనియర్స్ విభాగంలోని క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ఎంపిక చేసి వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి జనవరి 11 నుంచి 16 కేరళ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపుతామన్నారు. అనంతరం కెనాయింగ్, కయా కింగ్ అసోసియేషన్ చైర్మన్ ప్రదీప్ నాయుడు నుంచి ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోచ్ లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ క్రమంలోనే డ్రాగన్ బోట్ ట్రైల్ రన్ చేసే విధానాన్ని పరిశీలించారు. డ్రాగన్ బోటింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ముందస్తుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. క్రీడాకారులకు క్రీడలకు సంబంధించిన దుస్తులు, భోజన వసతులు జిల్లా క్రీడాభివద్ధి సంస్థ భరిస్తుందన్నారు. డ్రాగన్ బోటింగ్ ఛాంపియన్షిప్ పోటీలను ఒక్కొక్క బోటులో 12 మంది క్రీడాకారులను ఉంచి రెండు బోట్లకు 1000 మీటర్ల దూరం చేరుకునే విధంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. తొలిసారిగా రాయల చెరువులో నిర్వహించే డ్రాగన్ బోటింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు రాష్ట్రంలోని గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం, చిత్తూరు, నెల్లూరు, విజయవాడ జిల్లాలనుంచి క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తిరుమలరెడ్డి, రాయల చెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు త్యాగరాజులు, రాయలచెరువు మాజీ సర్పంచ్ మాధవి, రాయలచెరువు సర్పంచ్ మాదాసు మురగయ్య, నీటి సంఘాల అధ్యక్షుడు బాదూరు నరసింహారెడ్డి, ఎంపీడీవో ఇందిరమ్మ, ఇంచార్జ్ ఈవోపీఆర్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



గుంతల్లేని రోడ్లు నిర్మించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి

గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన మిషన్ హోల్ ఫ్రీ (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఆ దిశగా జిల్లావ్యాప్తంగా గుంతలు లేని రోడ్ల పనులను సంక్రాంతి నాటికి పూర్తిచేసేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఛాంబర్‌లో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆర్ అండ్ బి అధికారులు, నేషనల్ హైవే పీడీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీర్లతో మిషన్ హోల్‌ఫ్రీపై సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా గుంతలు లేని రోడ్ల పనులను పూర్తి చేసి పురోగతిలోకి తీసుకురావాలన్నారు. ప్రణాళికాబద్ధంగా రోడ్ల మరమ్మతుల విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా వెంటనే పూర్తవ్వాలన్నారు.

ఉచితంగా స్విమ్స్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - నాగలాపురం

స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో గురువారం నాగలాపురం పిహెచ్‌సి పరిధిలోని బీరకుప్పం సచివాలయం, టిపి.కోట సచివాలయంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్యభాను, సర్పంచులు సక్కుబాయి, హైమావతి, కార్యదర్శి శైలేంద్ర, పరంధామన్ పాల్గొన్నారు.

'ఆస్తి తగాదాల్లో రాజకీయ జోక్యం ఏంటి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆస్తి తగాదాల్లో రాజకీయ జోక్యం ఏంటని వైసిపి నాయకులు ప్రశ్నించారు. మితిమీరిన రాజకీయ వేధింపుల వల్లే బోనుపల్లి గ్రామంలో ముని సుబ్రమణ్యం మరణించాడని ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం తొట్టంబేడు మండల వైసీపీ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు ఉన్నం వాసుదేవనాయుడు మాట్లాడుతూ బోనుపల్లి గ్రామంలోని టిడిపి నేతలు గోటితో పోయేదాన్ని.. గొడ్డలి దాక తెచ్చి ఓ అమాయకుడు చనిపోవడానికి కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలగం ఆదెమ్మ కుటుంబంలో ఆస్తి తగాదాలు ఉంటే వారూ వారు చూసుకుంటారని అన్నారు. అలా కాకుండా రాజకీయాలు జొప్పించి ఆనంద్ తో పాటు అమ్మా, అన్నను పోలీసులు వేధించారని వాపోయారు. ఇప్పటికైనా టిడిపి నేతలు కక్షపూరిత రాజకీయాలు మాని గ్రామాలను అభివద్ధి చేయాలని సూచించారు. మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ కోవి చంద్రయ్య నాయుడు, ఎంపిటీసీ గాలి రవీంద్ర నాయుడు పాల్గొన్నారు.

ఎస్‌పికి జర్నలిస్టుల ఫిర్యాదు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఓ దినపత్రికలో ప్రచురించిన న్యూస్ పైన, ఆ పత్రిక ప్రతినిధికి పాకాలకు చెందిన వార్డు మెంబర్ రావిళ్ళ మోహన్ నాయుడు ఫోన్ చేసి ఎవడ్రా న్యూస్ రాసింది, నువ్వు జర్నలిస్ట్ అయితే నాకేంటి, నిన్ను, నీ బ్యూరో అంత తేలుస్తాం, రికార్డ్ చేసుకో, కేసు పెట్టుకో భయపడేది లేదు అంటూ బెదిరించి, వార్నింగ్ ఇచ్చి, నోటికి వచ్చినట్లు తిట్టడం జరిగింది. జరిగిన సంఘటనపై గురువారం తిరుపతిలోనే వివిధ జర్నలిస్టుల సంఘాలు ఆధ్వర్యంలో తిరుపతి ఎస్పీకి అతని మీద కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు కోలా లక్ష్మీపతి, మబ్బు నారాయణరెడ్డి, విజయ్ యాదవ్, గిరిధర్, ఉమాపతి, ప్రవీణ్, ఫోటోగ్రాఫర్ ప్రవీణ్, పరమేష్ రాజు, రాజేష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణాజిల్లాకు వంగవీటి పేరు పెట్టాలి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, తిరుపతి సిటి

కృష్ణాజిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని రాధా రంగా మిత్రమండలి శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడు సిద్ధులగారి ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతిని గురువారం స్థానిక కార్గిల్ సెంటర్, ఏరియా ఆసుపత్రి వద్ద రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, మిత్రమండలి ప్రధాన కార్యదర్శి వివి సుబ్బారావు పట్టణ అధ్యక్షులు పగడాల ప్రతాప్, పగడాల సుధాకర్, పాపి శెట్టి ప్రసాద్, పట్టాభి, నరసయ్య, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి నగరంలో అనంతవీధి సర్కిల్‌లో రాధారంగ మిత్రమండలి అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, వూక విజయ్ కుమార్, బుల్లెట్ రమణ, ఆముదాల తులసి రాం పాల్గొన్నారు.

మునిరత్నం నాయుడికి నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

మండలంలోని రామగిరికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి బత్తల మునిరత్నం నాయుడు భౌతికకాయానికి ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి నాయకులు ఏకాంబరరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డీ ఇలంగోవన్ రెడ్డి, టిడిపి నాయకులు రాజేంద్రనాయుడు, రాజేంద్ర, వెంకటరత్నం నాయుడు పాల్గొన్నారు

సబ్‌స్టేషన్ ఏఈగా రాజ్ కిరణ్

ప్రజాశక్తి - పిచ్చా టూరు

పిచ్చాటూరు మండలంలో గురువారం కొత్తగా సబ్ ఇంజనీరింగ్ బాధ్యతలు తీసుకున్న రాజ్ కిరణ్‌ను, సత్యవేడుకి బదిలీపై వెళుతున్న సబ్ ఇంజినీరింగ్ రవిని, ఇంచార్జ్ ఏ ఈ ప్రకాష్‌ను పిచ్చాటూరు సబ్‌స్టేషన్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ చంద్ర బాబు, సుందర రాజ్, సాయి పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ లోని ప్రగతి ఆఫీస్ నందు సీత శ్రీకాంత్ వర్ధంతి సందర్భంగా వారి అమ్మ సీత మంజుల, సోదరి సీత శ్రీవిద్య సహకారంతో 50 మంది నిరుపేద మహిళలకు చీరలు, వెజిటబుల్ బిర్యాని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు పుత్తూరు మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పట్టణంలోని స్థానిక పురపాలక సంఘ 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ప్రత్యేక సమావేశము, చైర్ పర్సన్ హరి అధ్యక్షతన శుక్రవారం ఉదయము 11.00 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశము పురపాలక సంఘ కార్యాలయ నూతన భవన సమావేశ మందిరము నందు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ చైర్ పర్సన్స్, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు అందరు సమావేశమునకు తప్పక హాజరు కావాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన రుయా సిఎస్‌ఆర్‌ఎంఓ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



రుయా ఆసుపత్రి సిఎస్‌ఆర్‌ఎంఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డాక్టర్ బి సుబ్బ లక్ష్మమ్మ కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్లో కలిసి పుష్ప గుచ్ఛాలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఓపి సేవలు మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని, అవుట్ పేషెంట్, వైద్య పరీక్షల విభాగాలు ఒకే చోట రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రాయలసీమ జిల్లాల నుంచి మెరుగైన వైద్యం కోసం అధిక సంఖ్యలో రోగులు రుయా ఆస్పత్రికి వస్తుంటారని తెలిపారు.

టాంటాం లేదు...కరపత్రాలు లేవు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర పభ్రుత్వం గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను అక్కడికక్కడే క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది. అయితే ఈ సదస్సులు తూతూమంత్రంగా సభలకే పరిమితమయ్యాయన్న ఆరోపణలు లేకపోలేదు. ముందురోజు టాంటాం..వేస్తామని, కరపత్రాలను ఆయా ప్రాంత ప్రజలకు అందించి సమాచారం అందిస్తామని ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం కలెక్టర్ సూచనలు, ఆదేశాలు ఎక్కడ అమలు కాలేదు. తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలోని మంగళం గ్రామంలో ధర్మరాజుల గుడివద్ద రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని అర్బన్ తాహాశీల్ధార్ భాగ్యలక్ష్మి ఇది వరకే ప్రకటించారు. గురువారం ప్రకటించిన చోట రెవిన్యూ సదస్సు నిర్వహించలేదు. ఈ ప్రాంతంలో టాం..టాం.. వేయలేదు...కరపత్రాలను పంపిణి చేయ్యలేదని స్థానికంగా ఉన్న సమాచారం. ప్రతి అర్జీదారుకి రసీదు ఇస్తామని చెప్పిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు ఇక్కడ అమలు కాలేదని

తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సు

సిపిఎం తిరుపతి పట్టణ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో ఎన్నో ఏళ్లుగా ఇళ్ళు నిర్మించుకొని జీవిస్తున్న ప్రజలకు ఇంటి పట్టాలను మంజూరు చేయ్యాలని, తిరుమలనగర్ పంచాయతీలో ఉన్న 42 ఎకరాల స్థలంలో పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలానే ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, దీనిపై చర్యలు తీసుకొని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మంగళం సిపిఎం శాఖ కార్యదర్శి ఎస్‌డి మోదిన్ వినతి రూపంలో తాహాశీల్ధార్ భాగ్యలక్ష్మికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా చినవెంకటయ్య, మునిరత్నం, హమీద్, వెంకటేష్, దేవానంద్, మునెమ్మ పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదిని కాపాడండి

స్వర్ణముఖి నది పరివాహ ప్రాంతాన్ని కాపాడాలని, ప్రభుత్వ భూములను ఆక్రమించిన భూకబ్జాదారులను అరెస్టు చేయాలని కోరుతూ సిపిఎం తిరుపతి రూరల్ కమిటీ ఆధ్వర్యంలో తిరుచానూరు రెవెన్యూ సదస్సులో రూరల్ డిప్యూటీ తహశీల్దార్‌కు సిపిఎం నాయకులు జయచంద్ర, పి.సాయిలక్ష్మి, కె.సుమన్ బృందం వినతిపత్రం అందించింది.

బిఎన్ కండ్రిగలో...కుక్కంబాకంలో తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్మశానానికి వెళ్లడానికి దారిలేక పంటపొలాల్లో తీసుకెళుతున్నామని స్థానికులు



తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు, ఆర్.ఐ నల్లయ్య పాల్గొన్నారు.

రామచంద్రాపురం మండలం మిట్టకండ్రిగలో 40 వినతులు అందాయి.

పాకాలలో... వరసిద్ధి వినాయక పేరుతో నమోదైన రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్‌చేశారు. పాకాల మండలం గాదంకి రెవెన్యూ గ్రామ పరిధిలో 2013లో 300001 ఖాతా నెంబర్లో 137 మంది రైతులకు చెందిన భూములు శ్రీ వరసిద్ధి వినాయక పేరుతో నమోదైవుంది. దీనివల్ల రైతులు ఈ సర్వే నంబర్ లో ఉన్న భూములు అమ్ముకోవాలన్నా, కొనాలన్న చానా ఇబ్బందిగా ఉందని రెవెన్యూ సదస్సులో పేర్కొన్నారు. ఇది తమ దేవస్థానానికి చెందినది కాదని ఎండోమెంట్ అధికారులు చెప్పినా సమస్య పరిష్కరించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఈ .మధుసూదన్ రావు, ఎం. సుగుణ, ఎం. ఆది కేశవరెడ్డి, ఎం. గుణశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర సైన్యం.. శతాబ్ది సంబరం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి నగరంలో సిపిఐ ఆవిర్భావ వేడుకలు అంబరాన్నంటాయి. నగరంలో భారీ ఎత్తున అరుణ పతాకాలు, ఎర్రజెండాలు, ఫ్లెక్సీలతో ముస్తాబు చేశారు. శత వసంతాల వేడుకకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా తిరుపతి అన్నమయ్య సర్కిల్ నుంచి కళాప్రదర్శనతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పద్మావతి పార్కు వద్ద కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. అక్కడ నుంచి జిల్లా సిపిఐ కార్యాలయం వరకు సాగిన ర్యాలీలో కళాకారుల నత్యాలు, డప్పు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కమ్యూనిస్టు నేతల నినాదాలు హోరెత్తాయి. అనంతరం కార్యాలయంలో కమ్యునిస్టు నేతలు పతాకావిష్కరణ చేసి అక్కడే ఉన్న అమరవీరుల స్థూపానికి ఘన నివాళులర్పించారు. ఆ తరువాత గంధమనేని శివయ్య భవనంలో భారీ సభ నిర్వహించారు. ముందుగా ప్రజానాట్య మండలి కళాకారులు ఎర్రజెండా పాటలను ఆలపిస్తూ వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ విజయాలను స్మరించుకున్నారు. తిరుపతి నగర కార్యదర్శి జె. విశ్వనాథ్ అధ్యక్షతన సభ జరిగింది. పి.హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశమంతా భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గత నాయకుల వీరోచిత త్యాగాలను, వారి పోరాటాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు ముందుంటామన్నారు. 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్లో సింగార్ వేళ్ చెట్టి అధ్యక్షతన జరిగిన మహాసభలో ఎస్వే గాటేని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొని భారత కమ్యూనిస్టు పార్టీ అధికారికంగా ఏర్పాటైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. శివారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ పాల్గొన్నారు.

పుత్తూరులో నాయకులు డి.మహేష్ ఆధ్వర్యంలో ఎంబిరోడ్డు సర్కిల్లో సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి జెండా ఆవిష్కరించారు. శ్రీకాళహస్తిలో జిల్లా కార్యదర్శి మురళి, ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, మించల శివకుమార్ పాల్గొన్నారు.

మహాకుంభమేళకు టిటిడి నమూనా ఆలయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఉత్తర ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ (అలహాబాద్)లో జరగనున్న మహాకుంభమేళకు టిటిడి తరపున నమూనా ఆలయ నిర్మాణం పనులను సకాలంలో పూర్తి చేయాలని టిటిడి తిరుపతి జెఇఒ ఎం. గౌతమి అధికారులను కోరారు. టిటిడి పరిపాలనా భవనంలోని మీటింగ్ హాలులో గురువారం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ (అలహాబాద్)లో జనవరి 13, 2025 నుంచి ఫిబ్రవరి 26, 2025 వరకు మహాకుంభ మేళలో జరుగనున్న నేపథ్యంలో టిటిడి పాలకమండలి నిర్ణయం మేరకు ఈవో శ్యామలరావు ఆదేశాలతో తిరుమల స్వామివారి ఆలయంలో జరుగుతున్న కైంకర్యాలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 12 సంవత్సరాలకోసారి పుష్కారాలు జరుగనున్న నేపథ్యంలో ఈ ఏడాది మహా కుంభమేళ ప్రయాగ్ రాజ్ లో జరుగుతోందన్నారు. ప్రయాగ్ రాజ్ కు విచ్చేసే అశేష భక్తులకు స్వామివారిని దర్శించుకునే అవకాశం టిటిడి కల్పిస్తోందన్నారు. ఎలాంటి రాజీ లేకుండా పుష్ప, విద్యుత్ అలంకరణలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల్, డిపిపి సెక్రటరీ రఘునాథ్, డిపిపి ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్. డిప్యూటీ ఈవోలు ఆర్. సెల్వం, శివప్రసాద్, ప్రశాంతి, గుణభూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల వల్ల మానసిక శారీరక ఉల్లాసం పెరుగుతుందని టేన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్యామ్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపికను గూడూరులో నిర్వహించారు .గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో టేన్ని కాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ఇక్కడ జరుగుతున్న పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జనవరి నెలలో పలాస లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. క్రీడలు ఆడడం వల్ల శారీరిక ధడత్వం పెరుగుతుందని, అలాగే క్రీడాకారుల కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు అక్కడ కూడా మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు ,భాస్కర్ ,హనుమంతరావు పాల్గొన్నారు .


శివయ్య సేవలో తమిళనాడు గవర్నర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి తమిళనాడు రాష్ట్ర గవర్నర్ ఆర్.యన్ రవి కుటుంబ సమేతంగా గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌కు దేవస్థానం డిప్యూటీఈవో ఎన్ ఆర్ కష్ణారెడ్డి శేష వస్త్రంతో సత్కరించి జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి తీర్థప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఏ.ఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, పి.ఆర్.ఓ రవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా యువత

స్వచ్ఛందంగా రోడ్లపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తెలుగు గంగ నీరు లీకుల కారణంగా ఆ రోడ్డు 400 మీటర్లకు పైగా అక్కడక్కడా గుంతలు తేలిపోయింది. ఇటుగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరిగే రోడ్డు దుస్థితిని చూసి అక్కడి యువత ఆలోచించారు. వారే వారి సొంత డబ్బులు వెచ్చించి గుంతలు పూడ్చడానికి కార్యసిద్దులై అమలుకు ఉపక్రమించారు. మంగళం పరిధిలోని మంగళం, తిరుమల నగర్ గ్రామ పంచాయతీల మధ్య కరకంబాడి మార్గం నుండి తిరుమల నగర్, క్రిష్ణవేణి యాధవ కాలనీ, బీటిఆర్ పురం, మోడల్ కాలనీలకు పోవు మార్గం తెలుగు గంగ లీకేజీల కారణంగా గుంతల మయంగా మారిపోయింది. ఈ మార్గంలో వాహన దారులు, పాదచారుల ఇబ్బందులను గమనించిన స్థానిక టిడిపి యువ నాయకుడు సతీష్(మంగళం నాని), అతని స్నేహితులు కలిసి వారి సొంత డబ్బులు ఖర్చు చేస్తూ గుంతలను పూడ్చుతున్నారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు జవాహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 9 కంపెనీలు వారు ఇంటర్వ్యూ లు నిర్వహించి ఉద్యోగాలు ఇవ్వడానికి జాబ్ మేళా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ చదివి 18-30 వయస్సు ఉన్న అభ్యర్థులు పాల్గొన వచ్చునన్నారు. అర్హులైన వారు బయోడేటాతో పాటు సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్, రెండు ఫోటోస్ పాటు ఉదయం 10 గంటలకు కళాశాల సెమినార్ హాల్‌లో హాజరు కావలెను. వివరాలకు బాబు రావు -ప్లేస్మెంట్ ఆఫీసర్ -9848553724, టి కిశోర్ -ప్లేస్మెంట్ ట్రైనర్ 6304330520 లను సంప్రదించాలని కోరారు.

బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో వసుధకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ :



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం పరిశోధక విద్యార్థి కే.వసుధకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిజం కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ఆచార్య టి. శోభారాణి మార్గదర్శకత్వంలో " ఏ స్టడీ ఆన్ గ్రీన్ ఎంటర్ప్రెయర్షిప్ రోల్ టు వర్డ్స్ సస్టైనబుల్ డెవలప్మెంట్ ఆఫ్ సౌత్ ఇండియా " అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు.

క్రైం న్యూస్

ఆగిఉన్న లారీని ఢీకొని...

డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - దొరవారిసత్రం



మండల పరిధిలోని కలకత్తా- చెన్నై జాతీయ రహదారి సమీపంలో ఉన్న హర్యానా దాబా వద్ద ఆగి ఉన్న లారీని ఈచర్ మినీ లారీ వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాద సంఘటనలో డ్రైవర్ మతి చెందాడు. వివరాల మేరకు.. బుధవారం రాత్రి దొరవారిసత్రం గ్రామ సమీపాన ఉన్న హర్యానా దాబా వద్ద చెన్నై వైపు వెళుతూ ఉన్న లారీ టైరు పగిలి ఆగిపోయింది. నెల్లూరు నుండి చెన్నై వైపు వెళుతున్న ఈచర్ లారీని వెనుక నుండి ఢీకొనడంతో ఈచర్ లారీ డ్రైవర్ రాజా కరుపాయల (27) లారీలో ఇరుక్కుపోయారు. ఈ సంఘటన తెలుసుకున్న ఎస్ఐ అజయ్ కుమార్ పరిస్థితిని గమనించి డ్రైవర్ను రెండు లారీల మధ్య నుండి గ్యాస్ కట్టర్ల సాయంతో బయటకు తీసి చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డ్రైవర్ మతి చెందాడు. మృతుడు తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు జిల్లా మరియమ్మ కోవెల్ ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు. ఎస్సై అజయ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గంజాయి అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 25 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందప్ప తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవిలాల చెరువు వద్ద గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచామన్నారు. గాంధీ పురం పంచాయతీ ధనలక్ష్మి నగర్ కు చెందిన చాంద్ బీ, మల్లంగుంట పంచాయతీ వినాయక నగర్‌కు చెందిన సాయి, ములకలచెరువు మండలం బురకాయల కోటకు చెందిన రసూల్ బీ గంజాయిని చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిందితులను అదుపు తీసుకునే వారి వద్ద నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు.



నారావారిపల్లిలో జ్యూట్‌బ్యాగ్స్ తయారీ శిక్షణ

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

రాష్ట్రంలోని మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకటమణి(నాని) అన్నారు. గురువారం మండలంలోని నారావారిపల్లెలో యూనియన్ బ్యాంక్ శిక్షణ కేంద్రం సహకారంతో ఉచిత జ్యూట్ బ్యాగ్స్ తయారీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా అభివద్ధి చెందాలంటే చేతివత్తులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నారావారిపల్లిని పైలెట్ ప్రాజెక్టుగా అభివద్ధి చేయాలనే ఉద్దేశంతో మొట్టమొదటగా స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని నారావారిపల్లెలో ప్రారంభించామని తెలిపారు. ఏ రంగంపేట నుండి భీమవరం గ్రామాల వరకు ఉన్న మహిళలందరూ శిక్షణా కేంద్రంలో ఇచ్చే చేతివత్తులపై శిక్షణ పొందాలని కోరారు. తయారుచేసిన వస్తువులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పైలట్ ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారిణి సుశీల దేవి, డిఆర్డిఏ పిడి టిఎన్ శోభన్ బాబు, ఎల్ డి ఎం విశ్వనాథరెడ్డి, యూనియన్ బ్యాంక్ శిక్షణ కేంద్రం డైరెక్టర్ సురేష్ బాబు, తహసిల్దార్ శివరాం సుబ్బయ్య పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ మండలం పాడిపేట గ్రామంలో సిసిరోడ్డు, వ్యాయామశాలను ప్రారంభించారు. ఆరు నెలల్లో పాడిపేట గ్రామంలో రూ.2 కోట్ల 32 లక్షలతో సిమెంట్‌రోడ్డు, వ్యాయామశాల ఏర్పాటు చేసి ఎన్నికల హామీలు నెరవేర్చామన్నారు.